## ఎస్టీ జాబితాలో చేర్చేందుకు మద్దతివ్వండి



కవితతో స్వామి, హరి

**నిజాంపేట్:** వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు మద్దతు ఇవ్వాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను నిజాంపేట్ వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు స్వామి, తార్నాక మాజీ కార్పొరేటర్ హరి ఆమె నివాసంలో కలిసి విన్నవించారు.

## కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతా



గెలుపొందిన పెద్దిరెడ్డి

**కుత్బుల్లాపూర్:** కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతానని మాజీ మంత్రి, టీఎన్‌టీయూసీ నాయకుడు ఈ పెద్దిరెడ్డి అన్నారు. ఐడీపీఎల్ సమీపంలోని మల్హోత్రా బ్లేడ్ కంపెనీలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో తన ప్రత్యర్థి సీఐటీయూ నాయకుడు కే మల్లికార్జున్‌పై 41 ఓట్ల మెజార్టీతో శుక్రవారం గెలుపొందారు. మొత్తం 207 ఓట్లలో పెద్దిరెడ్డికి 123 ఓట్లు పోలవ్వగా, మల్లికార్జున్‌కు 82 ఓట్లు వచ్చాయి. అనంతరం కంపెనీ గేట్ ఎదుట కార్మిక నేతలు, కార్మికులు విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంజినీరింగ్ విద్యపై ముగిసిన సదస్సు

**నిజాంపేట్:** ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ట్రాన్స్‌ఫర్మేషన్స్ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ పేరిట ఇంజినీరింగ్ విద్య చెందాల్సిన రూపాంతరంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. దేశంలోలోని పలు రాష్ట్రాల నుంచి యూఎస్ఏ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, పోర్చుగల్ తదితర దేశాల నుంచి సుమారు 350 మంది వక్తలు, అతిథులు, నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరయ్యారు. వీఎన్ఆర్ వీజేఐఈటీకి చెందిన విద్యార్థి ప్రగతి, డీన్ ఆచార్య డా.వై. పద్మశాయి, సంచాలకులు ఆచార్య డా.బి.చెన్నకేశవరావు, ప్రధానోధ్యాపకులు ఆచార్య డా.సి.డి. నాయుడు, వీజేఐఎం డీన్ ఆచార్య డా.రవినాథ్, విజ్ఞాన జ్యోతి ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, విజ్ఞానజ్యోతి సంస్థల పురోగమన సంచాలకులు ఆచార్య డా.కోడె సంధ్య పాల్గొన్నారు.

## డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌తో ఎం.శివప్రసాద్ శర్మ

**నిజాంపేట్ :** బాచుపల్లి మండలానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు శివ ప్రసాద్ శర్మకు డాక్టరేట్ లభించింది. 20 ఏళ్లుగా ఎంతోమందికి జ్యోతిష్య సలహాలు, సూచనలు ఇచ్చి వారు సన్మార్గంలో నడిచేలా కృషి చేశారు. అంతేగాకుండా 5 ఏళ్లుగా మనం మాట్లాడితే వచ్చే శబ్దాన్ని గణితం చేసి జాతకం చెప్పడంలో ప్రావీణ్యం పొందిన శివప్రసాద్ శర్మను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు గుర్తించి శుక్రవారం చెన్నైలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టరేట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## ఉద్యోగులకు విరమణ సహజం



**రంగారెడ్డినగర్:** ఉద్యోగులకు విరమణ సహజమని బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్ అన్నారు. రిటైర్డు హోంగార్డు కేశవులును సీఐ సురేశ్ కుమార్ శుక్రవారం శాలువాతో సత్కరించి బహుమతిని అందజేసి వీడ్కోలు పలికారు. సెక్షన్ ఇన్‌చార్జి లింగమయ్య, స్టేషన్ రైటర్ వెంకటేశ్‌గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కుత్బుల్లాపూర్:** తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.11 కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్యాంక్ కాలనీ, రాఘవేంద్రకాలనీ, హెచ్ఏఎల్ రాఘవేంద్రకాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎంఎన్ రెడ్డినగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి

ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



చింతల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద క్యూలో భక్తులు



హెచ్‌ఎంటీకాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద క్యూలో భక్తులు

**కుత్బుల్లాపూర్:** నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు తరలిరాగా ఆవరణలు సందడిగా మారాయి. అర్చకులు ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల వద్ద భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.



గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



నల్లగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద విద్యార్థులు



గాజులరామారం చిత్తారమ్మదేవి ఆలయంలో..



నిజాంపేట్ ఆంజనేయస్వామి ఆలయంలో..



గోదావరి హోమ్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో..

# ప్రభుత్వాసుపత్రి నిర్మించాలని వినతి

**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్టలో ప్రభుత్వాసుపత్రి నిర్మించాలని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కోరారు. ఈమేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహాను తన నివాసంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరై రెండేళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేదన్నారు. బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, నిరుపేదలు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంలో వెంటనే ఆసుపత్రి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని వినతి పత్రంలో కోరారు. స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసి వీలైనంత త్వరగా ఆసుపత్రి నిర్మాణం జరిగేలా చూస్తానని హామీఇచ్చారని ఐలయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్, హుస్సేన్, పటేల్, కమల్, కిశోర్ పాల్గొన్నారు



వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## మహాపీఠంలో భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**రంగారెడ్డినగర్:** రంగారెడ్డినగర్ సర్కిల్ పంచశీల కాలనీకి చెందిన రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిల్లా రాజశేఖర్‌రెడ్డి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం కూకట్‌పల్లిలోని శ్రీ అష్టలక్ష్మి సహిత గాయత్రీ మహాపీఠంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి, రామరావు, ప్రముఖ వెంగలాస్ క్యాటర్స్ అధినేత సుబ్బారెడ్డి, బిల్డర్ హేమాద్రి నాయుడు, విశ్రాంతి అయుర్వేద వైద్యులు జయరాం, ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పరికి చెరువును కాపాడండి

**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్లలో విస్తరించి ఉన్న పరికిచెరువును కాపాడాలని కోరుతూ సీపీఐ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ లెక్కల ప్రకారం పరికి చెరువు 45 ఎకరాల్లో ఉండేదని, ఇప్పుడు 80 శాతం వరకు కబ్జా అయ్యి ప్రస్తుతం కనీసం 15 ఎకరాలు కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అందులోని నిర్మాణాలు ఆపివేయాలన్నారు. ఆ చెరువు లేకపోతే భవిష్యత్తులో స్థానికులు నీటితో ఇబ్బంది పడాల్సి వస్తుందని విన్నవించారు. హైడ్రా కమిషనర్ స్పందించి వెంటనే సర్వే చేసి హద్దులు గుర్తించి, శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, ఉమా మహేశ్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు మహేందర్, ప్రభాకర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## మిస్టరీగా హత్యకేసు..!

**జీడిమెట్ల:** జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఈనెల 9న కలకలం రేపిన హత్యకేసు మిస్టరీగా మారింది. కడప జిల్లా తొండూరు మండలానికి చెందిన గోటూరు మనోహర్‌రెడ్డి కుమారుడు శివకుమార్‌రెడ్డి (26)ని కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు కలకలం రేపింది. అయితే ఆ హత్య విషయంలో పలు ఊహాగానాలు, విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. శివకుమార్‌రెడ్డినే తనను ఎవరో హత్య చేసినట్లుగా చేతులు వెనక్కి, కాళ్లు కట్టేసుకుని నోట్లో గుడ్డలు కుక్కుకుని ఉరివేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా పోస్టుమార్టం రిపోర్టులో సైతం శివకుమార్ రెడ్డి శరీరం లోపల ఎలాంటి గాయాలు లేనట్లుగా డాక్టర్లు నిర్ధారించినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు సైతం శివకుమార్‌రెడ్డిని వేరేవారు హత్య చేసేంత శత్రువుల ఎవరూ లేరని చెప్పినట్లు సమాచారం. తన ఆత్మహత్య మిస్టరీగా ఉండాలనే శివకుమార్‌రెడ్డినే ప్లాన్ ప్రకారం సీన్ క్రియేట్ చేసి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూట్యూబ్‌లో ఏమైనా వీడియోలు చూసి అలా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా ఈ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులకు అక్కడ హత్య జరిగినట్లు ఎలాంటి సాంకేతిక ఆధారాలు లభించలేదు.

## వృద్ధురాలి అదృశ్యం



శాంతిదేవి

**అల్వాల్:** వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సింహాద్రినగర్‌లో నివసించే శాంతి దేవి (67) మతిస్థిమితం సరిగా లేదు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి

**దుండిగల్:** వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కే సత్యనారాయణ అన్నారు. బిల్ కలెక్టర్లతో శుక్రవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ అసెస్‌మెంట్, అన్ అసెస్‌మెంట్, కమర్షియల్ ప్రాపర్టీస్ గుర్తించి ట్యాక్స్ విధించాలని, ఏరియర్స్ ఉన్న వాటిని గుర్తించి పన్ను కట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారులతో..**

కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్‌కు అప్లై చేసుకున్న దరఖాస్తుదారుల స్థలాలను పరిశీలించాలని కమిషనర్ సూచించారు. గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఐఎస్ సర్వేను తీసుకుని, ముందుగా కట్టిన రూ.1000 మినహాయించి మిగిలిన బ్యాలెన్స్ ఎంత కట్టాలో, అవసరమైన డ్యాక్యుమెంట్స్ నోటీస్ ద్వారా వాళ్లకి చేరవేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సంజన, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## రేపు జర్నలిస్ట్‌లకు ఉచిత వైద్య శిబిరం

**కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ ప్రెస్‌క్లబ్ ఐజేయూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సాయిబాబా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని బండారు ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుస్రుత్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఈసీఈ, 2డీ ఈకో, ఆర్‌బీఎస్ వంటి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## అలరిస్తున్న గ్రేట్ బాంబే సర్కస్

**కుత్బుల్లాపూర్:** హెచ్‌ఎంటీ మున్సిపల్ గ్రౌండ్ మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రేట్ బాంబే సర్కస్‌కు అనూహ్య స్పందన వస్తోంది. రాజకీయ నాయకులతో పాటు, సినీ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తిలకిస్తున్నారు. షోలో నిర్వహిస్తున్న ప్రపంచ ప్రఖ్యాత గల ఫైర్ డ్యాన్స్, మ్యాజిక్ షోలు ఆకట్టుకుంటున్నాయి.అలాగే సముద్ర సింహాలు, గొరిల్లాలు, లామా, బ్లాక్ ఫాండర్, హిప్పోపొటమస్‌తో పాటు 26 ఏనుగులు, 50 గుర్రాలు, 25 ఒంటెలు చిన్న పిల్లలను అలరిస్తున్నాయి. ప్రతిరోజూ 3 షోలు (మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలు, రాత్రి 7 గంటలకు) షోలు ప్రదర్శిస్తున్నామని, అలాగే సెలవురోజుల్లో అదనపు షోలు కూడా ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



షోలో ఫ్లయింగ్ ట్రాపెజ్



చైనీస్ కుక్కతో ప్రదర్శన

## ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

**జగద్గిరిగుట్ట:** రాజకీయలక అతీతంగా ఆలయ అభివృద్ధికి పాటుపడాలని కుత్బుల్లాపూర్ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ అన్నారు. జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీని శుక్రవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్, డైరెక్టర్లు, శ్రీనివాస్ చారి, బుచ్చిరెడ్డి రవి, రాజు, సునీత, వేణు గౌడ్, శ్రీకాంతాచార్యులు, రాజు యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

# బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

**ఆల్విన్‌కాలనీ:** బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ అభ్యర్థి రవికుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన డాక్టర్ వంశీరెడ్డిని డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ముఖ్య నాయకులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వంశీరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శామ రంగారెడ్డి, నరేశ్, సుభాష్‌చంద్ర, రాఘవేంద్రరావు, మణిభూషణ్ పాల్గొన్నారు.

## వాహనాల పార్కింగ్‌కు మార్కింగ్

**మోతీనగర్:** మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలో కొన్నేళ్లుగా పార్కింగ్ సమస్య నెలకొన్నది. దీంతో అంబులెన్స్, ఫైర్, మొబైల్ టీం వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు పార్కింగ్ సమస్య తీవ్రంగా తయారైంది. సంక్షేమ సంఘం నాయకుల చొరవతో కాలనీలో ఉన్న ప్రధాన వీధి రోడ్డు మధ్యలో కొంత ఫీల్ లైన్ ఉండేలా మార్కింగ్‌కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ మాట్లాడుతూ.. వాహనాలను క్రమ పద్ధతిలో మార్కింగ్‌కు లోబడి పార్కింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు మార్చి 31 వరకు పొడిగింపు

**సాక్షి,సిటీబ్యూరో:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పలు కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ/విద్యార్థులు 2024–25 సంవత్సరానికి పోస్ట్–మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తు గడువును మార్చి 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాల కోసం ఆయా కళాశాలల్లో ఈ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులు కొత్తగా రిజిస్ట్రేషన్/గతంలో అడ్మిషన్ పొంది చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు రెన్యువల్ రిజిస్ట్రేషన్ ఈ పాస్ వెబ్‌సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో చదువుతున్న వారిలో అర్హులైన విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిజిటల్ కీ కోసం కాలేజీ యాజమాన్యం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీ

**సాక్షి,సిటీబ్యూరో:** తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీ నియమితులయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా నవీన్ రెడ్డి, సంపత్, ఉపాధ్యక్షులుగా సునీల్, దుర్గాభవానీ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సైదిరెడ్డి ఫారుక్, కార్యదర్శులుగా చంద్రకళ, నవీన్, మహేందర్, అభిలాష్, సంయుక్త కార్యదర్శులుగా బలరాం, వినయ్, రవి, విజయ్‌కుమార్ తదితరులు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మహేందర్, వినయ్, నరసింహ, రతన్ రాజా ఎన్నికయ్యారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం ప్రకటించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రెటరీ జనరల్ పూల్ సింగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీజీటీఏ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు రాజేష్, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా మల్కాజిగిరి

- ఎంపీ ఈటల రాజేందర్
- పోస్టర్ ఆవిష్కరణ

**మేడ్చల్:** మల్కాజిగిరి పార్లమెంట్‌ను నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా మార్చేందుకు కృషి చేస్తున్నానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పూడూర్ పరిధిలోని తన నివాసంలో నిరుద్యోగ రహిత మల్కాజిగిరి పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వే చేసి ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారో తెలుసుకుని సమగ్ర నివేదిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల వెయ్యికి తగ్గకుండా ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని తెలిపారు.

# విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు

**దుండిగల్:** ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో అదే కాలేజీకి చెందిన కేమ్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలతో పాటు గాలి పటాలు ఎగురవేశారు. అలాగే కళాశాల ఆవరణలో గొబ్బెమ్మలను పెట్టి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఉత్తమ ముగ్గులు వేసిన వారికి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మర్రి అరుంధతి, ట్రిపుల్ ఈ విభాగం అధిపతి అశోక్‌కుమార్, ఏఐఎంఎల్ విభాగం అధిపతి సాయిప్రసాద్, కో.ఆర్డినేటర్ సందీప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బోధివృక్ష పాఠశాలలో..**

**జీడిమెట్ల:** సుభాష్‌నగర్‌లోని బోధివృక్ష ఒలింపియాడ్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు భార్గవిరెడ్డి, వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శిరీష, రాధిక, గోదావరి, హర్షవర్ధన్‌రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**భాగ్యరాధి డిగ్రీ కళాశాలలో..**

**చింతల్:** చింతల్‌లోని భాగ్యరధి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గులు, మెహందీ పోటీలు నిర్వహించి, విద్యార్థులకు గాలిపటాలు అందజేశారు. అనంతరం విజేతలకు ప్రథమ బహుమతి రూ. 1000, ద్వితీయ రూ. 500, మూడో బహుమతి రూ. 300 అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్లు చల్ల గోవింద రెడ్డి, నల్ల జై శంకర్ గౌడ్, నేవలి వెంకట్ రెడ్డి, కూచిపూడి రామకృష్ణ, ఘండం రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



బోధివృక్ష పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థుల తల్లులు



ఎంఎల్ఆర్ఐటీలో అధ్యాపకులు, విద్యార్థులతో చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి



విజేతలతో పాఠశాల ఉపాధ్యాయులు..



నగదు బహుమతి అందజేస్తున్న కళాశాల డైరెక్టర్లు